క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

నరసరావుపేటటౌన్: తల్లులు సరైన పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యవంతమైన బాలలను సమాజానికి అందించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ వైద్యశాలలో శిశువుల సంరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ హనుమకుమార్ న్యాయవాదులు, బ్లేస్సినా, హనుమంతరావు ఏడుకొండలు, పిఎల్‌విలు అబ్దుల్ రజాక్, జూనియర్ వైద్యులు, స్టాఫ్ నర్సులు, శిశువుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు బహూకరణ



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని సీతారామపురం గ్రామంలోని ఎస్‌వీఎస్‌సీ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థులు (1997–98, 10వ తరగతి) దాదాపు లక్ష రూపాయలు విలువ చేసే 16 బెంచీలను బహుకరించారు. విద్యార్థులు కూర్చొనేందుకు వీలుగా బెంచీలను అందజేసిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిష్లా కామేశ్వరరావుశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాతులూరులో వ్యవసాయ కృషి కార్యక్రమం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు గురువారం పంటల సాగు, నేలస్వభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారులు, వనరులు, పంటపొలాలను గ్రామ పటం ద్వారా చిత్రీకరించారు. గ్రామ మొబిలిటీ అంశాలను రంగవల్లులతో తీర్చిదిద్దారు. నేల స్వభావాలను బట్టి ఏ ఏ పంటలు వేసుకోవాలి, ఎలాంటి దిగుబడులు వస్తాయి అనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శరభయ్య, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణపై అవగాహన

నాదెండ్ల: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం సాతులూరులోని 4,5,6 అంగన్‌వాడీ కేంద్రాల్లో శిశుసంరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్ కె.పద్మ, హెచ్‌ఎం శ్రీనివాసరావు హాజరయ్యారు. ఏఎన్‌ఎంలు అవుల మల్లేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ నాగరాధిక, అంగన్‌వాడీలు జె విజయలక్ష్మీ, శ్రీవల్లి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుతో ఆన్‌లైన్ విలేకరిపై కేసు

నరసరావుపేటటౌన్: తమపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని టీడీపీ మహిళ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు ఓ ఆన్‌లైన్ పేపర్ విలేకరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా ఆ ఆన్‌లైన్ పేపర్‌లో వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలోవిలేకరి ఆలీఖాన్ మరో వ్యక్తి సుభాని ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డు వద్ద ఉండగా టీడీపీ మహిళ కార్యకర్త లక్ష్మీ తారసపడి వారిని ప్రశ్నించింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరువుకు భంగం కలిగించే విధంగా వార్త ఎలా రాస్తావు అంటూ వాగ్వివాదానికి దిగింది. ఈ క్రమంలో తన పట్ల ఇద్దరు దుర్భాషలాడి దురుసుగా ప్రవర్తించారని బుధవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 30వ తేదీ సంఘటన జరిగితే వారం తర్వాత బుధవారం ఫిర్యాదు చేయటం గమనార్హం. ప్రజా ప్రతినిధికి వ్యతిరేకంగా వార్త రాయటంతోనే అక్రమ కేసు బనాయించారని జర్నలిస్ట్ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

మొదటి దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారించవచ్చు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి

నరసరావుపేట రూరల్: క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా పూర్తిస్థాయిలో నివారించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రవి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో త్వరగా గుర్తించినట్లయితే నివారణ పూర్తి స్థాయిలో జరుగుతుందని తెలిపారు. గుండెజబ్బులు, క్యాన్సర్, మధుమేహం, దీర్ఘకాలిక ఉపిరితిత్తుల వ్యాధులను గుర్తించే ఎన్‌సీడీ స్క్రీనింగ్ త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు వివరించారు.

అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, డాక్టర్ హనుమకుమార్, రవీంద్రరత్నాకర్, డాక్టర్ రాజేశ్వరి, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ఉండాలి

శావల్యాపురం: క్యాన్సర్ వైద్య పరీక్షలు ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్గియుండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 సంవత్సరాల నిండిన వారికి క్యాన్సర్ వైద్య పరీక్షలు చేస్తామని వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నివారణ చర్యలకు సులువుగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు షుగర్, బీపీ, క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సులు ధనలక్ష్మి, ప్రమీల, బొడ్డుపల్లి అయ్యన్న, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ఆరోగ్య కేంద్ర పరిధిలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకు వచ్చి వైద్యసిబ్బంది ఉచితంగా క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని వైద్యాధికారి డాక్టర్ రేవతిభాయి తెలిపారు. ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. ఏడు రకాల క్యాన్సర్ లక్షణాలను ఆమె వివరించారు. మలమూత్ర విసర్జనలో మార్పులు, పొత్తికడుపు చర్మంలో మార్పులు, మానని పుండ్లు, రుతుక్రమంలో మార్పులు, రొమ్ములో గడ్డలు, నోటిదుర్వాసన, చిగుళ్ళనొప్పి రక్తస్రావం, అసాధారణ యోని రక్తస్రావం లక్షణాలు కనిపిస్తే వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. దగ్గరలో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పి. జగన్‌నరసింహారెడ్డి, కిరణ్, రామయ్య, హెచ్‌ఈవో ఎంఎస్ సురేష్ కుమార్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లల్ని భిక్షాటనకు ప్రోత్సహిస్తే ఏడేళ్లు జైలు

సీడీపీవో జి శాంతకుమారి హెచ్చరిక



మాట్లాడుతున్న శాంతకుమారి

యడ్లపాడు: పిల్లలచే భిక్షాటన ప్రోత్సహించడం నేరం.. అందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష ఉంటుందని ఐసీడీఎస్ నాదెండ్ల సెక్టార్ సీడీపీవో జి శాంతకుమారి చెప్పారు. మండలం పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బాలబాలికలకు ప్రత్యేకంగా అమల్లోకి తెచ్చిన వివిధ చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఎంపీవోలకు ఆయా చట్టాలపై అవగాహన సామర్థ్యాలను పెంపొందించే ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అతిథులు భేటీ బచావో.. భేటీ పడావో, ఆడపిల్లల రక్షణ, బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం –2006, పోక్సో చట్టం–2012 చట్టాలపై అవగాహన కల్పించారు.

అనంతరం ఆయా చట్టాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.హేమలతాదేవి, డీసీపీ యూ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, న్యాయవాది కె.వాణిశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.జోజమ్మ, కె.వెంకటరమణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్లో షుగర్, బీపీ పరీక్షలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ చక్రవర్తి

నరసరావుపేట ఈస్ట్: హెచ్.ఐ.వితో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వినియోగించే ప్రతి ఒక్కరూ షుగర్, బీపీ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నాన్ కమ్యూనికబుల్ డీసీజ్, సీడీసీ, పెప్ఫార్, షేర్ ఇండియా సహకారంతో ఎయిడ్స్‌తో జీవించే వారికి షుగర్, బీపీ పరీక్షలు గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏటీఆర్ సెంటర్‌లో ఈ పరీక్షలు నిర్వహించేలా పైలెట్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా జీవిత కాలాన్ని పెంచవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, పెప్ఫార్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, షేర్ ఇండియా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.జయకృష్ణ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీభాష, ఏఆర్‌టీ నోడల్ ఆఫీసర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఈశ్వర్ విద్యార్థులు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో షేక్ కరీమ్ మొహిద్దీన్, షేక్ నజీమ

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో సదర్లాండ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 21మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ప్రాంగణ ఎంపికకు బీటెక్, ఎంబీఏ విద్యార్థులు హాజరయ్యారు. సదర్లాండ్ కంపెనీ మేనేజర్ సోనియా థామస్, కంపెనీ సిబ్బంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు, బృందచర్చలు నిర్వహించారు. 180 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో పాల్గొనగా 21 మంది విద్యార్థులు ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.2.70 లక్షల వార్షిక వేతనం అందజేస్తారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్, డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ షేక్ ముజీర్, అధ్యాపకులు అభినందించారు.

స్విమ్మింగ్‌లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులకు పతకాలు



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూధనరావు గురువారం తెలిపారు. తమ విద్యార్థులు వై.మధుకిషోర్ 100మీ బటర్‌ఫ్లై, 50మీ బటర్‌ఫ్లై, 200మీ ఐఎం విభాగాలలో బంగారు పతకాలు, కె.సాకేత్ 50మీ, 200మీ బటర్‌ఫ్లైలో రజిత పతకాలు, 400మీ ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

హాజరుకాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న చంద్రకళ

రొంపిచర్ల : పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పల్నాడు జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ అన్నారు. మండలంలోని మాచవరం ఎంపీయూపీ పాఠశాలను, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం చంద్రకళ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలలో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే తీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రాపవుట్స్ విద్యార్థులను పాఠశాలలకు తీసుకొచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ప్రణాళికను తయారు చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలుపై విచారించారు. మెనూ అందించటంలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని, పరిశుభ్రత పాటించాలన్నారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారి డి. బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్



నివాళి అర్పిస్తున్న అట్లూరి శాంతి

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డాక్టర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి పాల్గొన్నారు. డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి మాట్లాడుతూ భారతీయ శాస్త్రలోకానికి సీవీ రామన్ విశేష సేవలు అందించారని తెలిపారు. సీవీ రామన్ శాస్త్రీయ కృషిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా దేశానికి సేవ చేయాలని తెలిపారు. అనంతరం క్విజ్, సైన్స్ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.10 వేలు, 5 వేలు నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ కార్యక్రమం



బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్యత అంశాలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిక్షకులుగా జి.బాజిరెడ్డి, ఎ. సాయిగోపిలు సచివాలయ సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యత కలవారిని వెలికితీసి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. 15 నుంచి 59 సంవత్సరాల లోపు వారికి స్కిల్ సెన్సెస్ వర్తిస్తుందని శిక్షణలో తెలిపారు. స్కిల్ సెన్సెస్‌లో సుమారు 2వేల అంశాలకు పైగా ఉన్నాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు శిక్షణను ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యత ఉన్నవారిని గుర్తించడం, ఆయా రంగాల్లో వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. శిక్షణలో డిజిటల్, సంక్షేమం, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి

శావల్యాపురం: భూమి సారవంతంగా ఉండాలంటే రైతులు రసాయనిక ఎరువులు పురుగుమందుల అవశేషాల వినియోగం తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం డిడిఏ మద్దినేని శివకుమారి అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుసేవా కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయ అధికారులు వీఏఏలకు పంటల సాగు, ఎరువులు యాజమాన్యం, చీడ పీడల సస్యరక్షణ, కలుపు యాజమాన్యం తదితర వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంటల సాగు అవగాహన సదస్సుపై విఏఏలకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించగా మొదట బహుమతి, నూజెండ్ల వీఏఏ గోపి, ద్వితీయ స్థానం ఈపూరు మండలం మప్పాళ్ళ-2 రైతుసేవా కేంద్రం వీఏఏ రాచకొండ గాయత్రి, తృతీయ బహుమతి ఈపూరు మండలం అంగలూరు విఏఏలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త యం. నగేష్, ఏడీఏ బోయపాటి రవిబాబు,ఏవోలు రామినేని రామారావు,అంకారావు, సుగుణబేగం,ఏఈవోలు పురేటి అశోక విఏఏలు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ఆరంభం



కేంద్రానికి తెచ్చిన పత్తి తేమను పరిశీలిస్తున్న దృశ్యం

యడ్లపాడు: రైతాంగానికి మేలు చేసేందుకు రాష్ట్రంలో తొలిగా పత్తికొనుగోలు కేంద్రాలను చిలకలూరిపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో ఉన్న శ్రీనివాస కాటన్ మిల్ నందు సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. నియోజకవర్గంలో మూడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటిలో నాణ్యమైన పత్తికి రూ.7521 క్వింటా కనీస మద్దతు ధరను నిర్ణయించి, 8శాతం తేమ కలిగిన పత్తికి క్వింటా ధర రూ.7,124 వరకూ రైతులకు అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఏడీఎం సూర్యప్రకాష్, బయ్యర్ బి రమేష్‌బాబు, చిలకలూరిపేట ఏఎంసీ కార్యదర్శి యు యోగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతమే కూటమి లక్ష్యం

యడ్లపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రికమైన డ్వాక్రా సంఘాల బలోపేతమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో నియోజకవర్గంలో మూడు మండలాల్లోని 992 గ్రూపులకు చెందిన 42వేల మంది సభ్యులకు రూ.70.80కోట్ల వివిధ రుణాల చెక్కుల్ని అందించారు.

స్కౌటింగ్‌తో క్రమశిక్షణ, సేవాభావం



స్కౌట్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఈవో నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో నాగేశ్వరరావు పాల్గొని స్కౌట్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు స్కౌట్స్ దోహదపడుతుందని తెలిపారు. తుఫాన్ బాధితుల సహాయార్థం రూ.42,000లు విరాళాలు సేకరించడం, పాఠశాలలో మొక్కలు నాటడం విద్యార్థుల్లో సేవా నిరతికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుడు ఎం.కృష్ణయ్య, పాఠశాల లీడర్ ట్రెయినర్ పమ్మి వెంకటరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోట్లూరులో చేపల చెరువు వేలంపాట

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో ఉన్ననటు వంటి చేపల చెరువును గ్రామస్తుల సమక్షంలో బహిరంగ వేలంపాటను గురువారం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలం పాటలో ఆరు మంది పాల్గొనగా గ్రామానికి చెందిన రావి పెద్ద బ్రహ్మేశ్వరరావు రూ. 8 లక్షల 30 వేలకు ఒక సంవత్సరానికి దక్కించుకున్నాడు. వేలంపాటలో సర్పంచ్ పోపూరి జ్యోతి ఈవోపీఆర్‌డీ పి.సుగుణ గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వేలో ప్రజాభాగస్వామ్యం తప్పనిసరి

శావల్యాపురం: త్వరలో జరగనున్న నైపుణ్యాల గణాంకాల సర్వే కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో నైపుణ్య గణన సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి 16 నుంచి 59 సంవత్సరాల లోపు కల్గిన వ్యక్తిగత సమగ్ర వివరాలను నైపుణ్యం యాప్‌లో నమోదు చేయాలన్నారు కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు చెన్నంశెట్టి లక్ష్మి ప్రసాదు, సురేష్ కుమార్, శ్రీలక్ష్మి, ఏపీవో కె.రామారావులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

నరసరావుపేట ఈస్ట్: ప్రజా సమస్యల పరిష్కారానికి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నిరంతర పోరాటాలు చేస్తుందని సమాఖ్య పల్నాడుజిల్లా కన్వీనర్ షేక్.సుభాని తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నరసరావుపేట నియోజకవర్గ ఏఐవైఎఫ్ నిర్మాణ మహాసభ నిర్వహించారు. మహాసభలో నియోజకవర్గ అధ్యక్షునిగా బాసు శ్రీనివాసరావు, కార్యదర్శిగా రొడ్డా అంజిరెడ్డి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో సుభానీ మట్లాడుతూ, బ్రిటిష్ కాలం నుంచి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐవైఎఫ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయవలసిన సమయం ఆసన్నమైనదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుకై 1644 దరఖాస్తులు

నాదెండ్ల: ఉమ్మడి కృష్ణ–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు సంబంధించి నాదెండ్ల మండల పరిధిలో గురువారం నాటికి 1644 ఓటు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు.